జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 27 | జూన్ | 2026 ◆ పేజీలు : 5

# మతసామరస్యానికి ప్రతీకగా మూడ్ తండాలో పీర్ల పండుగ



**టేకులపల్లి, జూన్ 26, ప్రజాజ్యోతి:** మండలంలోని మూడ్ తండ గ్రామంలో మొహరం సందర్భంగా శుక్రవారం పీర్ల పండుగను భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రజలను ఒక్కచోట చేర్చి సోదరభావాన్ని పెంపొందించే ఈ ఉత్సవాలు గ్రామంలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా

మిగతా 2 లో...

- లైసెన్స్ లేకుండానే కోట్ల రూపాయల వ్యాపారం..?
- ప్రజల అవసరాలే ఆదాయ వనరులుగా మారాయా..?
- ఎవరికి లైసెన్స్ లేదనే సమాచారం..?
- రూ. కోట్లల్లో నడుస్తున్న మనీ లెండింగ్ దందా..?
- ఆరుగురు కీలక వ్యక్తుల చేతుల్లోనే వ్యాపారం..?
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే వారికి ధైర్యమా..?
- ముక్కుపిండి మరీ అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు..!
- తనఖా పెట్టిన బంగారం, వెండికి సరైన రికార్డులు లేవా..?
- జిల్లా అధికారులు దృష్టి సారించాలని ప్రజల డిమాండ్

## ఇల్లందులో యథేచ్ఛగా...



5 లో..

# మనీ లాండరింగ్ దందా..!

ఇల్లందు పట్టణంలో అక్రమ మనీ లాండరింగ్ (వడ్డీ వ్యాపారం) యథేచ్ఛగా సాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లైసెన్స్ లేకుండానే కొందరు వ్యక్తులు రూ. కోట్ల మేర నగదు లావాదేవీలు నిర్వహిస్తూ ప్రజలను అధిక వడ్డీలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతుంది. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో డబ్బు అవసరమైన పేద, మధ్యతరగతి కుటుంబాల అవసరాలను ఆసరాగా చేసుకుని భారీ వడ్డీలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● ఇల్లందు, ప్రజాజ్యోతి

# నక్సల్స్ ఆయుధాల డంప్ స్వాధీనం

- భారీ ఆయుధాలు, రూ.24 లక్షలు నగదు స్వాధీనం



2 లో...

- స్పష్టత కోరుతూ ఆర్టీఐ దరఖాస్తు
- సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి 25 అంశాలతో వినతి
- చట్టబద్ధత, రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలపై పూర్తి వివరాలు ఇవ్వాలని అభ్యర్థన
- రిజిస్ట్రేషన్లు, మార్టిగేజ్ డీడ్లు, బ్యాంకు–ఎన్‌బీఎఫ్‌సీ రుణాలపై పూర్తి వివరాలు కోరిన 100 రోజుల శ్రీను




2 లో

# ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టిషన్ డీడ్లు, లోన్ల వ్యవహారాలపై ఆర్టీఐ

## నక్సల్స్ ఆయుధాల డంప్ స్వాధీనం

- భారీ ఆయుధాలు, రూ.24 లక్షలు నగదు స్వాధీనం



**చర్ల , జూన్ 26 (ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో నక్సలిజం నిర్మూలన దిశగా భద్రతా బలగాలు మరో కీలక విజయాన్ని సాధించాయి. ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని టెక్లా అటవీ కొండల్లో నక్సలైట్లు దాచిపెట్టిన భారీ ఆయుధాల డంప్‌ను స్వాధీనం చేసుకోగా, చిన్నేడోంగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టోయామేటా అటవీ ప్రాంతంలో రూ.24 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.జిల్లాలోని సున్నిత ప్రాంతా ల్లో నారాయణపూర్ పోలీసులు, భద్రతా బలగాలు నిరంతరం కూంబింగ్, ఏరియా డామినేషన్, గాలింపు చర్యలు చేపడుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో ఈ భారీ విజయాలు లభించాయి.టెక్లా అటవీ ప్రాంతంలో నిర్వహించిన గాలింపులో ఇన్సాస్ రైఫిల్, రెండు ఎస్‌ఎల్‌ఆర్ రైఫిళ్లు, రెండు .303 రైఫిళ్లు, 30–ఓసీ తుపాకులు, బీజీఎల్ లాంచర్, సింగిల్ షాట్ తుపాకి, వందల సంఖ్యలో లైవ్ రౌండ్లు, మ్యాగజైన్లు, డెటోనేటర్లు, బావోఫెంగ్ స్కానర్లు, కమ్యూనికేషన్ పరికరాలు, పేలుడు పదార్థాలు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.అలాగే చిన్నేడోంగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టోయామేటా అటవీ కొండల్లో నక్సలైట్లు దాచిపెట్టిన రూ.24లక్షల నగదును జూన్ 25న నిర్వహించిన గాలింపు చర్యల్లో భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ నగదు నక్సల్స్ కార్యకలాపాల కోసం వినియోగించేందుకు నిల్వ చేసినదిగా భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు ఆపరేషన్లతో నక్సలైట్ల ఆయుధ నిల్వలు, పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రితో పాటు వారి ఆర్థిక వనరులకు కూడా గట్టి దెబ్బ తగిలిందని పోలీసులు పేర్కొన్నారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, నగదు, ఇతర వనరులను గుర్తించి స్వాధీనం చేసుకునే చర్యలు ఇకపై కూడా నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. జిల్లాలో శాంతి భద్రత, అభివృద్ధి కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని నారాయణపూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## మతసామరస్యానికి ప్రతీకగా మూడ్ తండాలో పీర్ల పండుగ

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహించే పీర్ల పండుగలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పీరీలను గ్రామ వీధుల్లో ఊరేగిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకొని తమ కుటుంబాల సుఖసంతోషా లు, గ్రామ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు.హిందూ, ముస్లిం సోదరులు కలిసి నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక, సోదరభావ వాతావరణాన్ని నెలకొల్పాయి. మత సామరస్యాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తి పారవశ్యంతో కొనసాగాయి.ఈ కార్యక్రమంలో మూడ్ హుస్సేన్ నాయక్, మూడ్ రాజ్‌కుమార్, నాగేశ్వరరావు, మూడ్ కృష్ణ, మూడ్ గణేష్, సుమన్, సుభాన్, పూజారి ఫౌజా, పవన్, మహేష్, దయాకర్, రత్నశేఖర్ తదితరులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

- స్పష్టత కోరుతూ ఆర్టీఐ దరఖాస్తు
- సబ్-రిజిస్ట్రార్ కార్యాలయానికి 25 అంశాలతో వినతి
- చట్టబద్ధత, రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలపై పూర్తి వివరాలు ఇవ్వాలని అభ్యర్థన
- రిజిస్ట్రేషన్లు, మార్టిగేజ్ డీడ్లు, బ్యాంకు–ఎన్‌బీఎఫ్‌సీ రుణాలపై పూర్తి వివరాలు కోరిన 100 రోజుల శ్రీను




# ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టిషన్ డీడ్లు, లోన్ల వ్యవహారాలపై ఆర్టీఐ

**పాల్వంచ, జూన్ 26, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన పార్టిషన్ డీడ్లు (పారిఖత్తు దస్తావేజులు), మార్టిగేజ్ డీడ్లు, వాటి ఆధారంగా బ్యాంకులు మరియు ఎన్‌బీఎఫ్‌సీల ద్వారా రుణాల మంజూరు వంటి అంశాలపై స్పష్టత కోరుతూ సమాచార హక్కు చట్టం–2005 కింద కొడుపుగంటి శ్రీనివాస్(100 రోజుల శ్రీను) సబ్–రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్టర్ పోస్ట్‌ద్వారా ఆర్టీఐ దరఖాస్తు సమర్పించారు. పాల్వంచ మండలంలోని వీరునాయక్ తండాకు చెందిన కొడుపుగంటి శ్రీనివాస్ (100 రోజుల శ్రీను) ఈ దరఖాస్తును కొత్తగూడెం సబ్–రిజిస్ట్రార్ కార్యాలయ ప్రజా సమాచార అధికారికి రిజిస్టర్ పోస్ట్ ద్వారా సమర్పించారు. గత రెండేళ్లలో జరిగిన వివిధ రకాల రిజిస్ట్రేషన్లు, గ్రామ పంచాయతీ పరిధిలోని ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన పార్టిషన్ డీడ్ల నమోదు వివరాలు, వాటి సంఖ్య, సంబంధిత గ్రామాల వారీ సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టిషన్ డీడ్లను చట్టబద్ధంగా నమోదు చేయవచ్చా లేదా, వాటికి వర్తించే చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలు ఏమిటో వెల్లడించాలని అభ్యర్థించారు. పార్టిషన్ డీడ్ ఆధారంగా బ్యాంకులు లేదా ఎన్‌బీఎఫ్‌సీల వద్ద రుణాలు పొందడం చెల్లుబాటు అవుతుందా అనే అంశంపై కూడా అధికారిక సమాధానం కోరారు. గత రెండేళ్లలో పార్టిషన్ డీడ్ల ఆధారంగా ఎన్ని మార్టిగేజ్ డీడ్లు నమోదయ్యాయో, ఏజెన్సీ ప్రాంతాల్లో ఆస్తులను తనఖా పెట్టడం చట్టబద్ధమా కాదా అనే వివరాలతో పాటు సంబంధిత జీఓలు, సర్క్యులర్లు, నిబంధనలు, మార్గదర్శక పత్రాల ప్రతులను అందించాలని దరఖాస్తులో పేర్కొన్నారు. ఇంకా ఏజెన్సీ ప్రాంతాల్లో నమోదైన పార్టిషన్ డీడ్లు, మార్టిగేజ్ డీడ్ల సంఖ్య, తిరస్కరించిన దరఖాస్తుల వివరాలు, వాటి కారణాలు, గ్రామ పంచాయతీలకు సమాచారం పంపే విధానంపై కూడా పూర్తి సమాచారం కోరారు. ఈ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లు, ఆస్తుల తనఖాలు, రుణాల మంజూరు ప్రక్రియలపై స్పష్టత లభించే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించి పార్టిషన్ డీడ్ల రిజిస్ట్రేషన్లు, వాటి ఆధారంగా బ్యాంకులు మరియు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ద్వారా రుణాల మంజూరు జరుగుతున్నాయనే విషయాలు ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాస్తవ పరిస్థితులు ఏమిటి, చట్టాలు ఏమి చెబుతున్నాయి, ప్రభుత్వ మార్గదర్శకాలు ఏ విధంగా ఉన్నాయనే అంశాలపై స్పష్టత తీసుకురావాలనే ఉద్దేశంతో సమాచార హక్కు చట్టం–2005 కింద సబ్–రిజిస్ట్రార్ కార్యాలయానికి దరఖాస్తు సమర్పించాను. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఇళ్లు, ఇళ్ల స్థలాలకు పార్టిషన్ డీడ్లు నమోదు చేయడం చట్టబద్ధమేనా, ఆ డీడ్ల ఆధారంగా బ్యాంకులు లేదా ఎన్‌బీఎఫ్‌సీల వద్ద తనఖా పెట్టి రుణాలు పొందడం చట్టపరంగా అనుమతించబడుతుందా అనే అంశాలపై అధికారిక సమాచారం కోరాను. అలాగే గత రెండేళ్లలో నమోదైన పార్టిషన్ డీడ్లు, మార్టిగేజ్ డీడ్లు, వాటి సంఖ్య, సంబంధిత గ్రామాల వారీ వివరాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, సర్క్యులర్లు, మార్గదర్శక పత్రాల ప్రతులను కూడా ఇవ్వాలని అభ్యర్థించాను. ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలకు విరుద్ధంగా ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయా లేదా అన్నది అధికారిక రికార్డుల ద్వారానే వెలుగులోకి రావాలి. ప్రజలకు సరైన సమాచారం అందడం, చట్టాలపై అవగాహన పెరగడం, గిరిజనులు మరియు పేద ప్రజల హక్కులు పరిరక్షించబడటం కోసం ఈ ఆర్టీఐ దరఖాస్తు చేశాను. అధికారులు అందించే సమాచారాన్ని ప్రజల ముందుంచి వాస్తవాలను వెల్లడిస్తాను."



**కొడుపుగంటి శ్రీనివాస్**
(100 రోజుల శ్రీను)
సామాజిక కార్యకర్త, పాల్వంచ.

# ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి

- - పుస్తకాలు, యూనిఫాం పేరుతో అక్రమ దందాకు చెక్ పెట్టాలి
- - సౌకర్యాలు నిల్... ఫీజులు ఫుల్
- - ఏజెన్సీ విద్యా దోపిడీపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో వెంటనే స్పందించాలి
- - అక్రమ ఫీజులతో ప్రజలను వేధిస్తే సహించేది లేదు : రేణుక అక్షర మహిళా మండలి



**మణుగూరు, జూన్ 26 (ప్రజాజ్యోతి):** ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గంలోని మణుగూరు మండలంలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను జలగల్లా పట్టి పీడిస్తున్న ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

శుక్రవారం స్థానిక రేణుక అక్షర మహిళా మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భారీగా స్కూల్ ఫీజులు వసూలు చేయడమే కాకుండా, పుస్తకాలు, యూనిఫాంలు, షూస్, బ్యాగులు, ఇతర విద్యా సామగ్రిని కూడా పాఠశాలల ద్వారానే తప్పనిసరిగా కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ తల్లిదండ్రులపై వేల రూపాయల అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రచార కరపత్రాల్లో మాత్రం అత్యాధునిక సౌకర్యాలు లేనివి ఉన్నట్లు చూపిస్తూ తల్లిదండ్రులను, అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును అడ్డం పెట్టుకుని అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే గుర్తింపును కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలోని పేద, గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్వయంగా జోక్యం చేసుకుని ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్రమ ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్య సేవ కావాలి, వ్యాపారం కాదు అని హితవు పలికారు. పిల్లల భవిష్యత్తును పెట్టుబడిగా మార్చుకుని తల్లిదండ్రులను దోచుకునే విద్యా మాఫియాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు.

విద్యార్థుల నుంచి ఫీజులతో పాటు వివిధ కార్యక్రమాల పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్న యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోకపోతే రేణుక అక్షర మహిళా మండలి ఆధ్వర్యంలో విద్యాశాఖ కార్యాలయం ఎదుట దశలవారీగా ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎండి.షబానా, బొడ్డు సౌజన్య, కన్నాపురం వసంత, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం శైలజ, దేరంగుల సుజాత, బాడిష పార్వతి, లక్కింశెట్టి హేమలత తదితరులు ఉన్నారు.

# ప్రాచీన సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- బొడ్రాయి, ముత్యాల మ్మతల్లి పునప్రతిష్ఠ మహోత్సవం అభినందనీయం
- అన్నదానం సేవాభా వానికి, సోదర భావానికి ప్రతీక
- సిపిఐ జిల్లా కార్య దర్శి ఎస్.కె. సాబీర్ పాషా



**లక్ష్మీదేవిపల్లి, జూన్ 26 ( ప్రజాజ్యోతి )** మన ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా పేర్కొన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామంలో శుక్రవారం వైభవంగా నిర్వహించిన బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి పునప్రతిష్ఠమహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు భక్తిభావంతో కూడిన ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడమే కాకుండా, భావితరాలకు మన సంస్కృతి మూలాలను చేరవేస్తాయని అన్నారు. గ్రామదేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలంతా ఐక్యంగా, సమిష్టిగా కృషి చేస్తూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థులు ఐక్యతతో పునప్రతిష్ఠ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన సాబీర్ పాషా.. అన్నదానం వంటి సత్కార్యాలు సమాజంలో సేవాభావాన్ని, మానవత్వాన్ని పెంపొందిస్తూ ప్రజల మధ్య సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకట నర్సయ్య, రమణయ్య, వీరబాబు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీనివాసరావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణి




**ఇల్లందు, జూన్ 26 (ప్రజా జ్యోతి )** పట్టణంలోని శ్రీ శ్రీ ఐటీ అకాడమీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు కోర్స్ కంప్లీషన్ సర్టిఫికెట్‌లను శుక్రవారం ఘనంగా చేశారు. శిక్షణ పొందిన వారి భవిష్యత్తు విద్యా, ఉద్యోగ జీవితాల్లో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సంస్థలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలికి, వారికి నాణ్యమైన శిక్షణ అందించి ఉత్తమ నైపుణ్యాలతో తీర్చిదిద్దేందుకు సంస్థ కట్టుబడి ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు, ప్రతి ఒక్కరికీ సంస్థ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సెంటర్ డైరెక్టర్ దామోదర్ రావు మాట్లాడుతూ శ్రీ శ్రీ ఐటీ అకాడమీ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ విద్యార్థులకు నాణ్యమైన కంప్యూటర్ విద్య, నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలు ఉర్దూలో ప్రచురించాలి

- తెలంగాణలో ద్వితీయ అధికార భాష ఉర్దూను విస్మరించడం తగదు
- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 26,(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు ఓటర్లకు పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ఉర్దూ భాషలో కూడా అందుబాటులో ఉంచాలని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం ఎన్నికల కమిషన్ ను కోరినట్లు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుతో పాటు ఉర్దూ కూడా అధికారిక ద్వితీయ భాష అయినప్పటికీ, ఎన్నికల కమిషన్ ఎన్యూమరేషన్ ఫారాలను ఉర్దూలో ముద్రించకపోవడం లక్షలాది ఉర్దూ మాట్లాడే ఓటర్లకు ఇబ్బందులు కలిగిస్తోందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తెలుగులో మాత్రమే ఫారాలను అందిస్తున్నట్లు సమాచారం ఉందని దీంతో ఉర్దూ మాతృభాషగా ఉన్న వృద్ధులు, నిరక్షరాస్యులు, సాధారణ ప్రజలు ఫారాలను సరిగా అర్థం చేసుకుని పూరించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు, ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడైన ఓటరుకు తన భాషలో సేవలు అందించడం ఎన్నికల కమిషన్ బాధ్యత అని పేర్కొన్నారు. అందువల్ల ఎన్నికల కమిషన్ వెంటనే ఉర్దూ భాషలో కూడా ఎన్యూమరేషన్ ఫారాలను ముద్రించి పంపిణీ చేయాలని అలాగే ఉర్దూ మాట్లాడే ప్రాంతాల్లో ఉర్దూ తెలిసిన సిబ్బందిని నియమించి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని యాకూబ్ పాషా కోరారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ కు లేఖ రాయనున్నట్లు యాకూబ్ పాషా తెలిపారు.

## మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం



**ఇల్లందు, జూన్ 26 (ప్రజా జ్యోతి )**మత్తు పదార్థాలకు అలవాటై బంగారు భవిష్యత్తు అంధకారం చేసుకోవద్దని ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని రొంపేడు రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసైతే విద్య, ఆరోగ్యం, కుటుంబం, సమాజంలో గౌరవం అన్నీ కోల్పోయే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. క్షణిక ఆనందం కోసం మత్తు పదార్థాల జోలికి వెళ్లిన అనేక మంది యువత తమ జీవితాలను నాశనం చేసుకున్నారని తెలిపారు.విద్యార్థులు చెడు స్నేహాలకు, తప్పుడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. మత్తు పదార్థాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా నేరాలకు కూడా దారితీసే ప్రమాదం ఉందన్నారు. ప్రతి విద్యార్థి సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు దూతగా మారాలని, అనుమానాస్పదంగా మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగం రవాణా జరుగుతున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కొత్తపల్లి ఉమ, సర్పంచ్ యశోద, హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయుడు సారయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## బోడు గ్రామంలో బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కనకయ్య





**టేకులపల్లి, జూన్ 26, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బోడు గ్రామంలో ఇటీవల జరిగిన విషాద ఘటనల్లో బాధిత కుటుంబాలను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం పరామర్శించారు.ముందుగా విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన పోదేం చుక్కమ్మ కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ఈ సందర్భంగా ఘటనపై విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే సేకరించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం బలవన్మరణానికి పాల్పడిన మాడె పాపయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.వారి కుటుంబానికి కూడా ఆర్థిక సహాయం అందించి, అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాదర్ బాబు, నియోజకవర్గ నాయకుడు కోరం సురేందర్, మండల నాయకులు ఈది గణేష్, పోశాలు, సర్పంచులు కోరం శుభాష్ చంద్ర బోస్, సురేష్, కోరం హనుమంతు, నాయకులు సర్దార్, సంజయ్, రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకం

- డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల
- ఓటర్ల నమోదు లో పాల్గొన్న కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి



**కొత్తగూడెం కలెక్టరేట్ / పాల్వంచ, జూన్ 26,(ప్రజా జ్యోతి)** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకం అని అర్హులైన ప్రతి ఒక్క ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పాత పాల్వంచ 46వ డివిజన్ 77 పోలింగ్ బూత్ పరిధిలోని గడియకట్టలో ఓటర్లకు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్వాల తో పాటు ఆయన సతీమణి కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ అర్హులైన ఓటరు ఏ ఒక్కరు కూడా తమ ఓటు హక్కును కోల్పో కూడదనీ, అర్హులైన వారి ఓట్లు ఎట్టి పరిస్థితులలోనూ రద్దు కాకుండా అధికారులు, బూత్ లెవెల్ అధికారి, బూత్ లెవెల్ ఏజెంట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. బి.ఎల్.ఓ.లు, పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి ఓటు హక్కు కల్పించాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికుమార్, బూత్ లెవెల్ ఆఫీసర్ చందర్కర్, బి.ఎల్.ఎ మసనం శరత్ బాబు, బూసి శ్రీను, యాటా నాని, గడదాసు దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రగుంట చెరువు ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలి

- గ్రామస్తుల రోడ్డుబైఠాయింపు
- నిలిచిపోయిన భారీ వాహనాల రాకపోకలు



**పాల్వంచ, జూన్ 26, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపాలిటీ 48వ డివిజన్ పరిధిలోని ఎర్రగుంట చెరువును ఆక్రమించిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎర్రగుంట గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించారు.చెరువు ఆక్రమణ కారణంగా గ్రామ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆందోళనకారులు ఆరోపించారు. చెరువును పూర్తిగా ఆక్రమణల నుంచి విముక్తి చేసి పూర్వస్థితికి తీసుకురావాలని నినాదాలు చేశారు.గ్రామస్తుల రోడ్డుబైఠాయింపుతో ప్రధాన రహదారిపై భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రెండు వైపులా లారీలు, ఇతర వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు.చెరువు ఆక్రమణపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన భువన్ సుందర్ రెడ్డి

- ఓటర్ల సవరణ కార్యక్రమంపై గ్రామాల్లో అవగాహన
- అర్హులందరికీ ఇళ్లు అందిస్తామని హామీ



**పాల్వంచ, జూన్ 26, ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి భువన్ సుందర్ రెడ్డి శుక్రవారం పాల్వంచ మండలంలోని నారాయణరావుపేట, సంగం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో అందుతున్నాయా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేర్లు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ప్రక్రియను వివరించి ప్రతి అర్హుడూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుకు రావాలని సూచించారు.అనంతరం భువన్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించారని తెలిపారు.ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడి ఇంటి నిర్మాణం సాకారం అవుతుందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమైందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల కలలు నెరవేరలేదని విమర్శించారు. అలాగే జూన్ 30న పెన్షన్లు పంపిణీ చేయడంతో పాటు రైతుబంధు నిధులు కూడా రైతుల ఖాతాల్లో జమ అవుతాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మెంటం రాము, పెద్దమ్మతల్లి డైరెక్టర్ చెవుగాని పాపారావు, గిరిజన జిల్లా నాయకులు ధర్మసోత్ ఉపేందర్ నాయక్, గంగుల వెంకటేష్ రెడ్డి, తంబళ్ల వెంకటేశ్వర్లు, గుర్రం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# 1/70 చట్టం అమలుకు ఆదివాసుల ఐక్యత అవసరం

- గిరిజనేతరుల సుప్రీంకోర్టు పిటిషన్‌పై తీవ్ర ఆగ్రహం
- 5 వేల మందితో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు





**పాల్వంచ, జూన్ 26, ప్రజాజ్యోతి:** 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పాటు షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసుల హక్కులను పరిరక్షించేందుకు ఆదివాసులంతా ఐక్యంగా పోరాటం చేయాలని పలువురు గిరిజన నాయకులు పిలుపునిచ్చారు. ఏ ఇ డబల్యూ సి ఏ పాల్వంచ డివిజన్ అధ్యక్షుడు కల్తీ నరసింహారావు అధ్యక్షతన పాల్వంచలోని కొమరం భీం ప్రాంగణంలో నిర్వహించిన ఆదివాసుల ఐక్యత సదస్సులో ఈ మేరకు తీర్మానించారు.ఈ సందర్భంగా ఏ ఇ డబల్యూ సి ఏ, ఆధార్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు తెల్లం వెంకటేశ్వరావు, మెట్ల పాపయ్య మాట్లాడుతూ 1/70 చట్టం సవరణ కోరుతూ 1672 మంది గిరిజనేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోకి వచ్చిన గిరిజనేతరులు ఎలా స్థిరపడ్డారు, ఏ విధంగా భూములు సంపాదించారనే అంశాలపై ఐటీడీఏ అధికారులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అక్రమ వలసలు, భూముల ఆక్రమణలు, బినామీ పేర్లతో వ్యాపారాలు, కాంట్రాక్టులు కొనసాగుతున్నాయని ఆరోపించిన నాయకులు, గిరిజనుల హక్కులను పరిరక్షించేందుకు అవసరమైతే 5 వేల మంది ఆదివాసులతో సుప్రీంకోర్టులో పోరాటం చేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే 1970కు ముందు మరియు తరువాత ఏజెన్సీ ప్రాంతాల్లో స్థిరపడిన గిరిజనేతరుల సంఖ్య, వారి ఆధీనంలో ఉన్న భూములపై ప్రభుత్వం పూర్తి వివరాలు సేకరించాలని కోరారు. అవసరమైతే సమాచార హక్కు చట్టం ద్వారా ఆ వివరాలను ప్రజల ముందుకు తీసుకురావాలని సూచించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల చట్టాలు, భూ హక్కులను పరిరక్షించేందుకు రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమం అవసరమని పేర్కొంటూ, “క్విట్ ఏజెన్సీ” ఉద్యమం చేపట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో కోర్స జేజే రాంబాబు, పొడియం బాలరాజు, పొదెం కృష్ణప్రసాద్, గొప్ప వీరయ్య, పోలేబోయిన వెంకటేశ్వర్లు, వీసాల కృష్ణయ్య, వర్స లక్ష్మణ్, బుగ్గ రామనాథం, కుంజ రాంబాబు, తోలేం వెంకటేశ్వర్లు, పాయం ఆనందరావు, సోయం కన్నారావు, అరేం పాపారావు, పాయం రవివర్మ, వాసం ఆనంద్, కల్తీ సత్యనారాయణ, గొగ్గేలా రామస్వామి, మడివి అజయ్, సనప కోటి, దారబోయిన రమేష్, సోయం సత్యనారాయణ, వాసం రామకృష్ణ, పాయం సత్యనారాయణ, వాసం శ్రీకాంత్, పూసం సుధీర్, అరేం ప్రశాంత్, శెట్టిపల్లి శ్రీను, కన్నీబోయిన నర్సన్నతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన పెద్దలు, యువత పాల్గొన్నారు.

# మామకన్ను ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ వెంకన్నబాబు







**ఆళ్లపల్లి, జూన్ 26 (ప్రజాజ్యోతి)** ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మామకన్ను గ్రామ సమీపంలో ఇటీవల జరిగిన ద్విచక్ర వాహన రోడ్డు ప్రమాదంలో యువకుడు ప్రభాస్ మృతి చెందిన సంఘటన స్థలాన్ని శుక్రవారం ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు స్వయంగా పరిశీలించారు.ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తును వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసి వాస్తవాలను వెలికితీయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ, స్టేషన్‌లో నమోదైన కేసుల రికార్డులు, దర్యాప్తు పురోగతి, నిర్వహణ తీరును పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సోమేశ్వర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ డ్రగ్స్ నిర్మూలన దినోత్సవానికి పోలీసుల ప్రత్యేక కార్యాచరణ

- డాగ్ స్క్వాడ్‌తో కూడిన ప్రత్యేక పోలీసు బృందం మండల వ్యాప్తంగా విస్తృత తనిఖీలు



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 26 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో జాతీయ డ్రగ్స్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో కూడిన ప్రత్యేక పోలీసు బృందం మండల వ్యాప్తంగా డ్రగ్స్ నిరోధక తనిఖీలు నిర్వహించింది. ప్రధాన కూడళ్లు, షాపులు, వ్యాపార సముదాయాలు, రద్దీ ప్రాంతాల్లో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల కోసం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం కీలకమని పేర్కొన్నారు.గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, వినియోగం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా అత్యవసర సేవల నంబర్ 112కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు పేర్కొన్నారు. ప్రజలు, ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.





# ఇల్లందులో యథేచ్ఛగా...
# మనీ లాండరింగ్ దందా..!

- లైసెన్స్ లేకుండానే కోట్ల రూపాయల వ్యాపారం..?
- ప్రజల అవసరాలే ఆదాయ వనరులుగా మారాయా..?
- ఎవరికి లైసెన్స్ లేదనే సమాచారం..?
- రూ. కోట్లలో నడుస్తున్న మనీ లెండింగ్ దందా..?
- ఆరుగురు కీలక వ్యక్తుల చేతుల్లోనే వ్యాపారం..?
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే వారికి ధైర్యమా..?
- ముక్కుపిండి మరీ అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు..!
- తనఖా పెట్టిన బంగారం, వెండికి సరైన రికార్డులు లేవా..?
- జిల్లా అధికారులు దృష్టి సారించాలని ప్రజల డిమాండ్

**ఇల్లందు పట్టణంలో అక్రమ మనీ లాండరింగ్ (వడ్డీ వ్యాపారం) యథేచ్ఛగా సాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లైసెన్స్ లేకుండానే కొందరు వ్యక్తులు రూ. కోట్ల మేర నగదు లావాదేవీలు నిర్వహిస్తూ ప్రజలను అధిక వడ్డీలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతుంది. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో డబ్బు అవసరమైన పేద, మధ్యతరగతి కుటుంబాల అవసరాలను ఆసరాగా చేసుకుని భారీ వడ్డీలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**

● ఇల్లందు, ప్రజాజ్యోతి

స్థానికంగా ఆమ్ బజార్ అడ్డాగా ఆరుగురు కీలక వ్యక్తులే ఈ వ్యాపారాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారనే చర్చ సాగుతుంది. అవసరమైన వారికి నగదు ఇచ్చి బంగారం, వెండి తనఖాగా తీసుకోవడం, నెలవారీగా అధిక వడ్డీలు వసూలు చేయడం, గడువు దాటితే తనఖా వస్తువులను స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. అయితే వీరి వద్ద చట్టబద్ధమైన లైసెన్సులు లేవనేది జగమెరిగిన సత్యమని పలువురు బహిరంగంగా పేర్కొంటున్నారు.

### ››› తనఖా బంగారానికి లెక్కలున్నాయా?

ఆమ్ బజార్ లో వడ్డీ వ్యాపారుల వద్ద భారీ మొత్తంలో బంగారం, వెండి తనఖాగా ఉన్నప్పటికీ వాటికి సంబంధించిన పూర్తి రికార్డులు నిర్వహిస్తున్నారా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సంబంధిత శాఖలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తే పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### ››› ప్రజల బలహీనతలే పెట్టుబడిగా..!

ప్రజల అత్యవసర అవసరాల కోసం బ్యాంకుల్లో రుణాలు పొందలేని పరిస్థితిని కొందరు అవకాశంగా మలుచుకుని వడ్డీల పేరుతో ప్రజల నుంచి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వడ్డీ చెల్లింపుల్లో ఆలస్యం అయితే ఒత్తిళ్లు, హెచ్చరికలు కూడా ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.



### ››› అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?

ఇల్లందు పట్టణంలోని ఆమ్ బజార్ లో ఇంత పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ చీకటి వ్యాపారం సాగుతున్నప్పటికీ సంబంధిత శాఖల పర్యవేక్షణ కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లైసెన్సులు, లావాదేవీలు, తనఖా రికార్డులపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని, అక్రమాలు ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు విచారణ చేపడితే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ప్రజలు కోరుతున్నారు. ఈ దందాలో అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, లైసెన్స్ లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.